


మురళీమోహనరావుకు సత్కారం



విజయనగరం : రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3020 ఆధ్వర్యాన సమ్మోహనం పేరిట విజయనగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన మెంబర్‌షిప్ సెమినార్‌లో శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది యెరుకోల మురళీమోహనరావును సత్కరించారు. 2023-24 సంవత్సరానికి గానూ అత్యధికంగా క్లబ్ మెంబర్‌షిప్‌లను చేయించినందుకు క్లబ్ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ రావూరి వెంకట సుబ్బారావు చేతుల మీదుగా షీల్డ్, ప్రశంసాపత్రంతో పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా క్లబ్‌లో నూతన సభ్యులను చేర్పించిన మురళీమోహనరావును పలువురు అభినందించారు.

సాగుకు సానుకూలం

- జూలైలో సాధారణానికి మించి 73 శాతం వర్షం
- అధిక వర్షపాతం కేటగిరీలో 17 మండలాలు
- ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం
- జిల్లాలో 47 శాతం మేర పంటల సాగు





ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జూన్‌తో పోలిస్తే ఈనెలలో అన్నదాతలకు కొంత ఊరట లభించింది. జూలైలో సాధాణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. వర్షాభావ పరిస్థితుల నుంచి జిల్లా కరువు బారి నుంచి పూర్తిగా తొలగకున్నా, పంటల సాగు కాస్త పర్వాలేదనిపిస్తోంది. సాగుకు కొంత సానుకూలత కనిపిస్తోంది. అడపాదడపా వర్షాలు పడుతుండడంతో సాగు శాతం పెరిగింది. జూలైలో కురిసిన వర్షాలతో జిల్లాలో ప్రస్తుతం లోటు వర్షపాతం కేటగిరీలో ఉన్న మండలాల సంఖ్య గణనీయంగా తగ్గింది. పలు మండలాల్లో అధిక వర్షపాతమూ నమోదైంది. పంటల సాగు నెల రోజుల కిందటి పరిస్థితితో పోలిస్తే పంటల సాగు పరిస్థితి కూడా కొంత మెరుగుపడింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వర్షాభావ పరిస్థితుల నుంచి జిల్లా రైతాంగం క్రమేణా గట్టెక్కుతోంది. నెల రోజుల కిందట పరిస్థితులతో పోలిస్తే సాగు గణనీయంగా పెరిగింది. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,37,165 ఎకరాల సాగు లక్ష్యంగా నిర్దేశించుకోగా 2,05,758 ఎకరాల్లో (47 శాతం) పంటలు వేశారు. వరి పంటను 3,98,750 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 1,80,458 ఎకరాల్లో (45 శాతం) సాగైంది. మొక్కజొన్న పంట సాగు కాస్త బాగుంది. ఈ ఏడాది 26,375 ఎకరాల విస్తీర్ణం వేయాలని అనుకోగా, 16,163 ఎకరాల్లో (82 శాతం) వేశారు. చెరుకు పంటను 4,550 ఎకరాల మేర వేస్తారని అంచనా వేయగా 1085 ఎకరాలు (24 శాతం) మేర వేశారు. పత్తి పంటను 4,620 ఎకరాల్లో వేయాలనుకోగా 2,210 (48 శాతం) మేర వేశారు. కందులు 335 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటివరకు 73 ఎకరాలు (21 శాతం) మేర సాగవుతోంది. వేరుశనగ 1333 ఎకరాల మేర సాగు లక్ష్యం కాగా, ప్రస్తుతం 190 ఎకరాల్లో (14 శాతం) వేశారు.

జూలైలో 73 శాతం అదనపు వర్షపాతం

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జూన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, ఈనెలలో సాగుకు కొంత సానుకూల పరిస్థితులు నెలకొన్నాయి. జూన్‌లో సగటున 134.9 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 69.6 మి.మీ మాత్రమే నమోదైంది. వర్షపాతం లోటు 48.4 శాతంగా ఉంది. జూలైలో సాధారణ వర్షపాతం 184.4 మి.మీ ఉండగా 319.8 మి.మీ వర్షం కురిసింది. అదనంగా 73.4 శాతం అదనంగా వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లాలో 17 మండలాలు అధిక వర్షపాతం కేటగిరీలో చేరాయి. ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, ఆరు మండలాల్లో ఇంకా వర్షపాతం లోటు కనిపిస్తోంది. జూలై ప్రారంభంలో తీవ్ర వర్షపాతం లోటులో ఉన్న సోంపేట మండలం కొంతమేర వర్షాభావ పరిస్థితుల నుంచి గట్టెక్కింది. మొత్తం మీద చూస్తే అదనంగా వర్షం కురిసింది. సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో ఈ కాలానికి 342.8 మి.మీ వర్షపాతం నమోదవుతుండగా, ఇప్పటివరకు 400.7 మి.మీ వర్షపాతం నమోదైంది. 16.9 మి.మీ అదనంగా వర్షం పడింది.

నెల రోజుల కిందట పరిస్థితి ఇలా...

ఖరీఫ్ సీజన్‌లో సరిగ్గా నెల రోజుల కిందట అన్నిరకాల పంటలు కలిపి ఒక్క శాతం మాత్రమే అయ్యాయి. జిల్లాలో అన్నిరకాల పంటలు కలిపి 4,37,153 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 4,590 ఎకరాల్లో (ఒక శాతం) మాత్రమే రైతులు వేయగలిగారు. ఇందులో వరి 3,98,750 ఎకరాలకు గానూ 1975 ఎకరాల్లో సాగైంది. వర్షాభావ పరిస్థితులతో సజ్జలు, రాగులు, కందులు, పెసలు, మినుములు, నువ్వులు, చెరుకు, పత్తి విత్తనాలను ఒక్కచోట కూడా వేయలేకపోయారు. మొక్కజొన్న పంటను 26,375 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా 2,512.5 ఎకరాలో (పది శాతం) మాత్రమే వేశారు. వేరుశనగ పంటను 1333 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 98 ఎకరాలు (ఏడు శాతం), గోగు పంటను 258 ఎకరాలకు గానూ ఐదెకరాల్లో (రెండు శాతం) మాత్రమే వేయగలిగారు.

వంశధార కాలువలకు పుష్కలంగా నీరు

ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని రిజర్వాయర్లు, బ్యారేజీల్లో నీటిమట్టం నిల్వలు బాగా పెరిగాయి. హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ పూర్తి సామర్థ్యం 0.66 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 0.65 టిఎంసిల నీరు ఉంది. దీంతో కుడి, ఎడమ కాలువలకు పుష్కలంగా నీటిని విడిచిపెడుతున్నారు. కుడి కాలువకు 1900 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 700 క్యూసెక్కుల వరకు వదులుతున్నారు.



చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న వైసిపి నాయకులు



ఎస్ఎఫ్ఐ నాయకుడిని ఈడ్చుకుంటున్న తీసుకెళ్తున్న పోలీసులు (ఫైల్)

డిఎస్‌పి గారూ.. ఇది ర్యాలీ కాదా?

- ఎస్ఎఫ్ఐ శాంతియుత ర్యాలీ అడ్డగింత
- వైసిపి ర్యాలీకి మాత్రం అనుమతి
- పోలీస్‌స్టేషన్ వద్దే చంద్రబాబు దిష్టిబొమ్మ దగ్ధం
- బాలచంద్రారెడ్డి తీరుపై విమర్శలు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

మణిపూర్‌లో మారణకాండను ఆపాలని, ప్రజలు, మహిళలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు శనివారం శాంతియుతంగా నిర్వహించిన ర్యాలీని అడ్డుకున్న పోలీసులు, పుంగనూరు ఘటనపై వైసిపి నాయకులు ఆదివారం నిర్వహించిన ర్యాలీకి మాత్రం ఏ అడ్డంకులూ చెప్పలేదు. శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పినా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రాజును పోలీస్‌స్టేషన్‌కు ఈడ్చుకువెళ్లారు. డిఎస్‌పి బాలచంద్రారెడ్డి ఆయనపై చేయి కూడా చేసుకున్నారు. అధికార పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించి, టెక్కలి పోలీస్‌స్టేషన్ వద్దే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్ధం చేసినా మిన్నకున్నారు. దీంతో డిఎస్‌పి తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీకి ఒకలా... ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలపై మరోలా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. శాంతియుతంగా తమ భావాలను వ్యక్తం చేసుకునే హక్కు, నిరసనలు తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించింది. కానీ, శాంతియుతంగా చేపట్టే నిరసనలు, ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపడం పరిపాటిగా మారింది. అదే అధికార పార్టీ విషయానికి వచ్చేసరికి మాత్రం పోలీసులకు ప్రజాస్వామ్యం గుర్తొస్తుందన్న విమర్శలు వస్తున్నాయి.



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోడీ

రైల్వే చరిత్రలో సరికొత్త అధ్యాయం

- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ
- రైల్వే అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన

ప్రజాశక్తి - పలాస

రైల్వే చరిత్రలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. అమృత్ భారత్ పథకం కింద పలాస రైల్వేస్టేషన్‌లో రూ.23.85 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన రైల్వేస్టేషన్లు మల్టీ మోడల్ హబ్‌గా మారుతాయని చెప్పారు. సుమారు గంటపాటు సాగిన ప్రధాని ప్రసంగాన్ని ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు, ప్రజలు పలాస రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టీవీల్లో వీక్షించారు. అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అమృత్ భారత్ కింద ఎంపిక చేసిన 508 రైల్వేస్టేషన్లలో పలాసను ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. వైద్యునిగా ఉన్న సమయంలో 60కి పైగా దేశాల్లో పర్యటించానని, అక్కడున్న విలాసవంతమైన, వేగవంతమైన రైళ్లను చూసి మన దేశంలో ఎప్పుడు వస్తాయని ఎదురుచూడగా, వందేభారత్ రూపంలో సాకారమైందన్నారు. కోరమాండల్, షిరిడీ, రామేశ్వరం ఎక్స్‌ప్రెస్‌లకు పలాస రైల్వేస్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని రైల్వే అధికారులను కోరారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు చెందిన ఎక్కువ మంది ప్రజలు ఛత్తీస్‌ఘడ్, బిలాయ్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారని, పలాస నుంచి బిలాయ్ వరకు రైలు సౌకర్యం కల్పించాలని కోరారు. తాళ్లభద్ర వద్ద ఆర్‌ఒబి ఏర్పాటు చేయాలని అందుకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. నర్సిపురం కాలిబాట మార్గాన్ని త్వరగా పునరుద్ధరణ చేయాలని విజ్ఞప్తి చేశారు. అంబుసోలి ప్రాంతంలో రైల్వే ఆస్తులను ఆక్రమించారని ఇటీవల నోటీసులు ఇచ్చారని వాటిని రెగ్యులరైజ్ చేస్తే, ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైల్వే శాఖకు ప్రత్యామ్నాయ భూమిని ఇస్తుందన్నారు.

ఈ కార్యక్రమానికి సంబంధించి పలు అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించగా, విజేతలకు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలను మంత్రి అప్పలరాజు అందజేశారు. కార్యక్రమంలో సిఎంపిఇ ఎన్.కె సమాల్, ఎడిఇన్ ఆర్.ఆర్ దాస్, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, స్థానిక కౌన్సిలర్ గుజ్జు జోగారావు, జి.ఎల్ రావు, ఎన్.వి.ఎల్.ఎన్ మూర్తి, బిజెపి జిల్లా అధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు, కొర్ల కన్నారావు, ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రవహించే పాటల తూటా గద్దర్

ప్రజా గాయకుడు గద్దర్ మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి - ఆమదాలవలస

గద్దర్ పాటంటే గాలికి కొట్టుకొచ్చిన గాలివాటం కాదని, కాలిగోటి నుంచి నడినెత్తి దాకా ప్రవహించే పాటల తూటా అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. ప్రజా యుద్ధనౌక ఇక లేరన్న విషయం తెలిసి తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్న రోజుల్లో అప్పటి ప్రభుత్వం నక్సలైట్లతో చర్చలు జరిపేందుకు మంత్రిగా తాను, నక్సలైట్ల తరపున గద్దర్ హాజరయ్యామని గుర్తు చేసుకున్నారు. నాటి నుంచి ఆయనపై తనకెంతో గౌరవం, అనుబంధం ఉండేదని పేర్కొన్నారు. పేదల గుండెచప్పుడుగా ఆయన నోట పాడిన ప్రతి పాట ప్రజల పాట అని కొనియాడారు. ప్రజాదరణ ఉన్న గొంతుక ఆయన సొంతమని, ఆ గొంతు మూగబోయిందంటే నమ్మశక్యం కావడం లేదని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు : సిఐటియు

శ్రీకాకుళం : ప్రజా గాయకుడు గద్దర్ మృతి అభ్యుదయ సాహిత్య లోకానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.నర్సింగరావు, కె.సుబ్బరావమ్మ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు అన్నారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సిఐటియు జిల్లా వర్క్‌షాపులో గద్దర్ మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్దర్ తన కళలతో ప్రజలను చైతన్యపరిచారని కొనియాడారు. దశాబ్దాల పాటు యువతను ఉర్రూతలూగించారని, జానపద కళారూపాలకు విప్లవ సాహిత్యాన్ని



జోడించి ప్రజా సంస్కృతికి పట్టం కట్టారన్నారు. సామాజిక మార్పు కోసం తపన పడ్డారని, ఇందుకోసం నిర్బంధాన్ని అనుభవించారని చెప్పారు.

ప్రజల హృదయాల్లో యుద్ధనౌక : సిపిఎం

గద్దర్ ప్రజల హృదయాల్లో యుద్ధ నౌకగా నిలిచారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాజ మార్పు కోసం తన ఆటపాటతో పనిచేశారని తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బాధాకరం : వైసిపి

నరసననపేట : గద్దర్ మృతికి ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. తన జీవితమంతా ప్రజా పోరాటాలకే అంకితం చేసిన గొప్ప ధీశాలి గద్దర్ అని కొనియాడారు. ఆయన పాటలను వింటూ సాయంత్రాలను గడిపే వాళ్లమని గుర్తు చేసుకున్నారు. 1980, 90ల్లో జిల్లాలో గద్దర్ పాటలు ఎంతో ప్రజాదరణను పొందాయని తెలిపారు. గొప్ప ఆశయాలు ఉన్న వ్యక్తులను కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు.

టెక్కలి, రూరల్ : గద్దర్ మృతి సాహిత్య లోకానికి తీరనిలోటు అని పేడాడ భీమారావు విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు పేర్కొన్నారు. డిటిఎఫ్ రాష్ట్ర నాయకులు కోత ధర్మారావు, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా నాయకులు మిస్క కృష్ణయ్య, బెలమర ప్రభాకరరావు, బిఎస్‌పి నాయకులు బోకర నారాయణరావు, జన చైతన్య మండలి జిల్లా సభ్యులు సుంకు గోపీనాథ్, దుప్పాడ జగన్నాథరావు, కె.దమయంతి సంతాపాన్ని తెలిపారు.

పొందూరు : కోట్లాది మంది ప్రజలను తన గళంతో ఉత్తేజపరచిన అభ్యుదయ, విప్లవ గాయకుడు గద్దర్ చిరస్మరణీయుడని, ఆయన మృతి జానపద విప్లవ కళా, సాహిత్యాలకు తీరని లోటు అని జాతీయ సవర భాష సంఘం అధ్యక్షుడు డాక్టర్ అల్లంశెట్టి చంద్రశేఖరరావు, రచయిత వాండ్రంగి కొండలరావు పేర్కొన్నారు. జాతీయ కళాకారునికి స్మృతి చిహ్నాలు ఏర్పాటు చేసేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

మత్స్యకారులకు మీరేం చేశారు?

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష



సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

నాలుగేళ్లుగా మత్స్యకారులను మోసం చేసి ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పడం తప్ప వారి అభివృద్ధికి ఏం చేశారో చెప్పగలరా అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మంత్రి సీదిరి అప్పలరాజును ప్రశ్నించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మత్స్యకార తరగతిలో పుట్టి మత్స్యశాఖ మంత్రిగా పదవి చేపట్టిన అప్పలరాజు వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటకు చెందిన 200 కుటుంబాలకు మత్స్యకార భరోసా రాకుండా అడ్డుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నువ్వలరేవుకు చెందిన మత్స్యకార విద్యార్థి అనుమానాస్పద మృతి చెందితే ఆ కుటుంబానికి ఏం న్యాయం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మూలపేటలో పోర్టు ఏర్పాటు చేయడం ద్వారా మత్స్యకారులకు లబ్ధి పక్కన పెడితే, వైసిపి నాయకులకే లబ్ధి చేకూరుతోందని ఆరోపించారు. మంచినీళ్లపేట, నువ్వలరేవు ప్రాంతంలో హార్బర్ నిర్మిస్తామని మత్స్యకారులకు కల్లబొల్లి మాటలు చెప్పి, రక్షణ గోడ నిర్మించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. వైసిపి హయాంలో పోర్టులు, హార్బర్లు పూర్తి చేయగలమని దమ్ముంటే చెప్పగలరా అని సవాల్ విసిరారు. టిడిపి హయాంలో 75 శాతం సబ్సిడీపై బోట్లు, ఇంజిన్లు, వలలు మత్స్యకారులకు పంపిణీ చేశామన్నారు. పది శాతం సబ్సిడీపై డీజిల్ ఇచ్చామని చెప్పారు. తుపాను సెంటర్లు, చేపలు ఆరబెట్టేందుకు షెడ్లు నిర్మించామన్నారు. వైసిపి హయంలో మత్స్యకారులకు ఏ పథకాలు ఇచ్చారో చెప్పాలన్నారు. ఆఫ్‌షోర్ పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామని ప్రతి సమావేశంలో మంత్రి చెప్పడమే తప్ప, పూర్తి చేసే పరిస్థితి లేదని విమర్శించారు.

వైసిపి ప్రభుత్వంలో కేవలం రూ.తొమ్మిది కోట్లు మాత్రమే వెచ్చించి పనులు చేపడితే, టిడిపి హయాంలో రూ.450 కోట్లతో పనులు చేపట్టామన్నారు. మంత్రి అధికార అహంకారంతో వ్యాపార సముదాయాలు ధ్వంసం చేసి నేటికి మూడేళ్లు కావస్తున్నా కెటి రోడ్డు విస్తరణ పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. ఎన్నికలు ముందైనా ఆ రోడ్డు పూర్తి చేస్తారో, లేదో చెప్పాలన్నారు. వైసిపి హయాంలో నల్లబొడ్డులూరు, సూదికొండ, నెమలికొండలను మింగడమే తప్ప ఏం అభివృద్ధి చేశారని ఎద్దేవా చేశారు. అబద్ధాలు చెప్పడంలో మంత్రి అప్పలరాజు ఆరితేరిపోయారన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, వజ్రపుకొత్తూరు మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, బిసి సెల్ కార్యదర్శి గోవింద పాపారావు, మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, బడ్డ నాగరాజు, టంకాల రవిశంకర్ గుప్త, ఎం.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే గొడుగు కిందకు సంక్షేమ వసతిగృహాలు

- వసతిగృహాల్లో ఉద్యోగుల సర్దుబాటు
- నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం
- పిల్లల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు
- బిసి సంక్షేమశాఖ అధికారి ఇ.అనురాధ





ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ వసతిగృహాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి ఇ.అనురాధ తెలిపారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమశాఖల పరిధిలోని వసతిగృహాల పర్యవేక్షణకు క్షేత్రస్థాయిలో ఉమ్మడి కార్యాచరణ అమల్లోకి రానుందన్నారు. ప్రస్తుతం మూడు శాఖల పర్యవేక్షణకు డివిజన్ స్థాయిలో ఉన్న పోస్టులను కుదించి ఒకరికి ఆ బాధ్యతలను అప్పగించనున్నట్లు చెప్పారు. వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన బోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లాలో బిసి సంక్షేమశాఖ పరిధిలో సుమారు 70వేల మంది వరకు బాలబాలికలు వసతి సౌకర్యాలను పొందుతున్నారని చెప్పారు.

వసతిగృహాల్లో ఉద్యోగుల కొరతను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారా?

జిల్లాలో వసతిగృహాల్లో ఉద్యోగుల కొరత ఉంది. ప్రతి హాస్టల్ నిర్వహణకు సంక్షేమాధికారి పర్యవేక్షణలో నలుగురు ఉద్యోగులు తప్పనిసరి. కుక్, కమాటీ, వాచ్‌మెన్, స్వీపర్ వంటి ఉద్యోగులు పూర్తిస్థాయిలో ఉంటే నిర్వహణకు వీలవుతుంది. జిల్లావ్యాప్తంగా రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య ఏటా తగ్గుతోంది. తాత్కాలిక పద్ధతిలో అవుట్‌సోర్సింగ్ సేవల ద్వారా కొంతమందిని నియిమించడమైంది. విద్యార్థుల సంఖ్యను బట్టి అక్కడ సిబ్బంది నియామకాలు జరుగుతాయి. కొన్ని ప్రాంతాల్లో సర్దుబాటు చేయాల్సి వస్తోంది. ఇప్పుడు మూడు సంక్షేమ శాఖలు ఒకే గొడుగు కిందకు వస్తే మిగులు ఉన్న చోట్ల సర్దుబాటు వీలవుతుంది. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్నిరకాల చర్యలు తీసుకునేందుకు వీలవుతుంది.

వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జిల్లాలో 81 బిసి వసతిగృహాలు ఉన్నాయి. అందులో 18 పోస్టుమెట్రిక్ వసతిగృహాల కాగా మిగిలినవి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నవి. పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో 10 బాలికల కోసం నిర్వహిస్తున్నాం. కట్టుదిట్టమైన భద్రతతో పాటు అన్నిరకాల సౌకర్యాలు అందుబాటులో ఉండేవిధంగా వసతిగృహాల నిర్వహణ ఉంది. వీటికితోడు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ వసతిగృహాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మౌలిక వసతులను కల్పించేందుకు వీలుగా ఈ మార్పులు రానున్నాయి.

విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

వసతిగృహాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. సీజనల్ వ్యాధుల వల్ల అస్వస్థతకు గురయ్యే ప్రమాదం వసతిగృహాల్లో ఎక్కువగా ఉంటుంది. అందువల్ల తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వసతిగృహాల్లో ఉండే విద్యార్థులు స్కూల్‌కు తప్ప ఇతర ప్రదేశాలకు వెళ్లకుండా పూర్తి కట్టడి చేయడం జరుగుతోంది. అందులో భాగంగా సంక్షేమాధికారుల పర్యవేక్షణ మరింత పటిష్టంగా అమలు చేస్తున్నాం. ఎవరికైనా జ్వరం, జలుబు, దగ్గు, చర్మ సంబంధిత వ్యాధులు ఉన్నట్లయితే అందరితో కాకుండా వేరే గదిలో ఉంచి వారికి వైద్యం అందించేలా ఆదేశాలు ఇచ్చాం. గ్రామ సచివాలయాల్లో ఉన్న ఆరోగ్య కార్యకర్తలు, వెల్ఫేర్ అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించేలా ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి.

వసతిగృహాల్లో మెనూ అమలు ఎలా సాగుతోంది?

ప్రభుత్వం నిర్దేశించిన మేరకు వసతిగృహాల్లో మెనూ అమలు తప్పనిసరి. ధరల పెరుగుదల వల్ల ఎక్కడైనా సంక్షేమాధికారులు మెనూ అమలును నిర్లక్ష్యం చేస్తున్నట్లు దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల ఆరోగ్యం, ఆహార నియమావళిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వారికి పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగానే పర్యవేక్షణ చేస్తున్నాం. పర్యవేక్షణకు తగినంత మంది వార్డెన్లు లేరు. ఒక్కో వార్డెన్‌కు పక్కనున్న హాస్టల్ పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించాం.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

జీడి మొక్కల పరిహారం చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నిర్మాణంలో నష్టపోయిన జీడి మొక్కలకు నష్టపరిహారం చెక్కులను వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూలపేట పోర్టుతో బాధితులకు ఎటువంటి నష్టం లేకుండా నష్టపరిహారం అందజేస్తామని హామీనిచ్చారు. ఈ పోర్టుతో ఈ పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, విశ్వసముద్రం కంపెనీ జనరల్ మేనేజర్ శంకర్, మూలపేట ఉప సర్పంచ్ జీరు రాంబాబు, కోట దాలయ్య, జీరు శివారెడ్డి, జీరు రోనంకిరెడ్డి, దారపు అప్పలరెడ్డి, జీరు శేఖర్ పాల్గొన్నారు.

చదరంగం పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

ఈనెల 10 నుంచి 12 వరకు శ్రీకాకుళం నగరంలోని ఇందిరా విజ్ఞాన భవన్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి అండర్-11 చదరంగం పోటీల బ్రోచర్‌ను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు, చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జామి రమేష్, వైసిపి నాయకులు చింతాడ మంజు, చింతాడ గణపతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గార ఎంపిపి రఘురాం

విద్యుత్ సమస్యలతో అవస్థలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గార మండల పరిషత్ అధ్యక్షులు గొండు రఘురాం, శ్రీకాకుళం మండల వైసిపి నాయకులు అంబటి శ్రీనివాసరావులు కోరారు. టౌన్‌హాల్లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గార మండలం చల్లపేట సబ్‌స్టేషన్‌లోని ఐదు మెగా వాట్స్ ట్రాన్స్ ఫార్మర్ నెల రోజుల క్రితం కాలిపోయిందని అన్నారు. కానీ, దాని స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫారం వేయకుండా తాలూరు సబ్‌స్టేషన్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను చల్లపేటకు మార్చారని తెలిపారు. దీనివల్ల దిగువ ప్రాంతంలో ఉన్న రైతుల వ్యవసాయ మోటార్లకు లోఓల్టేజీ సమస్య తలెత్తి వ్యవసాయ బోర్లు పనిచేయడం లేదన్నారు. బోర్లు పనిచేయని కారణంగా ఇంతవరకు గార మండలంలో వరి నాట్లు వేసుకోలేక పోతున్నారని వివరించారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే సబ్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే వంశధార మెయిన్ కెనాల్ నుంచి 300 టిఎంసిల నీరు దిగువ ప్రాంతాలకు రావల్సి ఉందని అన్నారు. వంశధార ఇంజినీర్ల నిర్లక్ష్యం కారణంగా 140 టిఎంసి నీరు మాత్రమే దిగువ ప్రాంతాలకు అందిస్తున్నారని అన్నారు. సమావేశంలో గార మండల వైసిపి కన్వీనర్ పీసా గోపి, రాష్ట్ర నాటక అకాడమి డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, వైస్ ఎంపిపి అరవల రామకృష్ణ, కొయ్యన నాగభూషణం, తమ్మిన అప్పలరాజు పాల్గొన్నారు.

తవ్వేశారు... వదిలేశారు

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులోని మురుగునీటి కాలువపై ఉన్న పలకలను ఇటీవల ప్రొక్లెయినర్‌తో తహశీల్దార్ ఎం.చక్రవర్తి, ఇఒపిఆర్‌డి కృష్ణారావు ఆధ్వర్యాన తొలగించారు. మురుగునీరు రోడ్డుపై వెళ్తుండడంతో స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పలకలు తొలగించి సమస్య పరిష్కరిస్తామని అనుకున్నారు. పనులు చేపట్టిన తరువాత కొంతమంది అడ్డుకోవడంతో ఎక్కడి పనులు అక్కడే వదిలేశారు. దీంతో మురుగునీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో నిల్వ ఉంటుంది. దీనిద్వారా దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గతంలో మురుగు నీరు, వర్షపు నీరు సాంఘీక బాలుర వసతి గృహంలోకి ప్రవేశించడంతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ ఆధ్వర్యాన విద్యార్థులతో ఆందోళన చేపట్టారు. టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి వచ్చి పరిశీలించారు. వసతిగృహం విద్యార్థులను ఉన్నత పాఠశాలలో ఉన్న బాలికల నూతన వసతిగృహానికి తరలించారు. గతంలో వర్షపు నీరు, సాగునీరు వెళ్లేందుకు ఉన్న బ్రిటిష్ నాటి కల్వర్టును కొంతమంది కప్పి వేయడంతో నీరు వెళ్లేందుకు మార్గం లేకుండాపోయింది. రూ.లక్షలు వ్యయం చేసి కట్టిన కాలువ పనికి రాకుండాపోయింది. కాలువ నీరు వెళ్లేందుకు కల్వర్టు నుంచి చెరువుకు పోయేందుకు ప్రతిపాదనలు పంపించాలని రెవెన్యూ, ఆర్‌అండ్‌బి అధికారులను సబ్‌కలెక్టర్ ఆదేశించారు. అదేశించి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఒక వైపు కాలువ నిర్మించారు. కానీ మురుగునీరు చెరువుకు వెళ్లేందుకు మార్గం చూపలేదు. దీంతో మురుగునీరు కాలువలో, రోడ్డుపై నిల్వ ఉండిపోవడంతో అవస్థలు పడుతున్నారు. రెండో వైపు అలా వదిలేయడంతో వారి వారి ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలువను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


చెక్క పైనుంచి వెళ్తున్న స్థానికుడు


నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

మణిపూర్ ఘటనపై నిరసన

ప్రజాశక్తి- పొందూరు

మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలకు పాల్పడిన దోషులను వెంటనే శిక్షించాలని క్రైస్తవ సంఘాలు ఆదివారం నిరసన ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, దేశంలో పూర్తిగా శాంతిభద్రతలు విఫలమయ్యాయని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బస్టాండ్ నుంచి అంబేద్కర్ కూడలి వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ కూడలిలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ గంట సంపత్‌కుమార్, గౌరవ అధ్యక్షులు ప్రభుదాసు, పాస్టర్లు ఎల్.జోషఫ్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, సాత్విక ఎస్తేరు పాల్గొన్నారు.


సంతకాలను సేకరిస్తున్న నాయకులు

మామిడిపల్లిలో సంతకాల సేకరణ

సోంపేట : మండలంలోని మామిడిపల్లి పంచాయతీలో సిపిఎం సీనియర్ నాయకులు పాతిని కృష్ణమూర్తి ఆదివారం సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి రైతులకు మద్దతుగా పోరాటం నిర్వహిస్తున్నామని, దీనికి మద్దతుగా ప్రజల నుంచి లక్ష సంతకాల సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. మద్దతు కల్పించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం జీడి పిక్కలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్దానంతో గద్దర్‌కు అనుబంధం

ప్రజాశక్తి- పలాస

పీపుల్స్‌వార్ ఉద్యమం నుంచి ప్రస్తుత మావోయిస్టు ఉద్యమం వరకూ ప్రజా గాయకుడు గద్దర్‌కు ఉద్దానంతో ఎంతో అనుబంధం ఉంది. విప్లవాలకు పుట్టినిల్లు అయిన పలాస మండలం బొడ్డపాడుతో గద్దర్‌కు ఎనలేని సంబంధాలు ఉన్నాయి. నాటి పీపుల్స్‌వార్ ఉద్యమం తీవ్రంగా ఉన్న రోజుల్లో నిషేధాజ్ఞల సమయం 1989లో వజ్రపుకొత్తూరు మండలం గుణుపల్లిలో నిర్వహించిన బహిరంగసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళామండలి సభ్యులతో విప్లవ గీతాలు నిర్బంధాల మధ్యే ఆలపించి చరిత్ర సృష్టించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత మావోయిస్టులతో చర్చలు జరుపుతున్న సమయంలో వారిపై ప్రభుత్వం నిషేధాన్ని తొలగించింది. అందులో భాగంగా అప్పటి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మావోయిస్టు సభలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. తెలంగాణ ప్రాంతమైన మొగిలిచర్లలో మొదటి సభ నిర్వహించగా, వజ్రపుకొత్తూరు మండలం బాతుపురంలో రెండో సభ నిర్వహించారు. ఈ సభకు గద్దర్‌తో పాటు కీర్తిశేషులు వంగపండు ప్రసాదరావు, వరవరరావు, కళ్యాణరావులు పాల్గొన్నారు. గద్దర్ అక్కుపల్లి గ్రామం నుంచి రెండు కిలోమీటర్లు పొడవునా పాదయాత్ర చేస్తూ బాతుపురం సభలో పాల్గొని తమ సందేశాన్ని వినిపించారు. ఈ ఏడాది జనవరి 11న పలాస మండలం నీలావతిలో సిక్కోలు జానపద కళాజాతలో పాల్గొని గ్రామంలో పర్యటించారు. తనకు ఉద్దానంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. స్థానిక కళాకారులతో ఆట-పాట పాడుతూ ఉర్రూతలూరించిన విషయాన్ని ఇక్కడ ప్రజలు మరిచిపోలేదు. ఇంతలో ఆయన విప్లవోద్యమం నుంచి శాశ్వతంగా నిష్క్రమించడం ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.



యాదవులపై దాడులు అరికట్టాలి

టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు యాదవ్

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో యాదవులు కటుంబాలపై చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ అన్నారు. కాశీబుగ్గలో పార్లమెంటరీ కన్వీనర్ ఐ.జగదీష్ యాదవ్ అధ్యక్షతన జిల్లా యాదవుల సాధికారిత మేధోమధన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బిసి తరగతుల కుటుంబాలను విస్మరించిందన్నారు. టిడిపి హయంలో యాదవులకు ప్రథమ స్థానం కల్పిస్తే, ఈ ప్రభుత్వం దూరం చేసిందన్నారు. రాజ్యాధికారంలో యాదవులకు భాగస్వాములు చేయాలన్నారు. గొర్రెల కాపారులకు తప్పిడి గుళ్ల ఉచితంగా పంపిణీ చేశారు. కళాకారులకు 50 ఏళ్లకు పింఛను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరిత్య వల్ల నష్టపోయిన కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదవ నాయకులు డి.తాతారావు, ఢిల్లీరావు, జగదీష్, ధర్మారావు, డి.నర్సింగులు తవిటయ్య, కూర్మారావు, చిట్టిబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కామేశ్వరరావు


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని గోపాలపురం సమీపం పాత జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నందిగాం మండలం నౌగాం సర్పంచ్ పుష్ప సత్యం బెండి గేటు నుంచి కాశీబుగ్గ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. మెళియాపుట్టి మండలం పరసరాంపురానికి చెందిన కొర్రాయి ధనుంజయ, కాశీబుగ్గ ట్రాక్టర్ షోరూంలో పనిచేస్తున్న రాము కాశీబుగ్గ నుంచి బెండి గేటు వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. గోపాలపురం వద్ద రెండు వాహనాలు ఢీకొనడంతో సత్యం, ధనుంజయకు కాళ్లు విరిగిపోగా, రాముకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చిన్నం నాయుడు క్షతగాత్రులకు వైద్య సేవలు అందించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల చెంతకు విద్యార్థినులు

బూర్జ : మండలంలోని కొల్లివలస కెజిబివి విద్యార్థులు ఆదివారం తల్లిదండ్రుల వద్దకు చేరారు. కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు బుధవారం అదృశ్యమైన విషయం విదితమే. కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అశోక్‌బాబు మూడు బృందాలను పంపించారు. చివరకు అందిన సమాచారం మేరకు హైదరాబాద్ సమీపంలోని జీడిమెట్ల ప్రాంతంలో విద్యార్థినుల ఆచూకీ తెలుసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా విద్యార్థినులను వాహనంలో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ గాయత్రి సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుని భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. నాలుగు రోజులుగా మానసిక వేదన పడిన తల్లిదండ్రులు తమ పిల్లలు చేరడంతో ఊపిరి పీల్చుకున్నారు.

హారికాప్రసాద్‌కు ఇంటర్నేషనల్ అవార్డులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

లయన్స్ ఇంటర్నేషనల్ శ్రీకాకుళం జోనల్ చైర్మన్‌గా, శ్రీకాకుళం లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా కె.ఎన్ఎస్.వి.ప్రసాద్ (హారికాప్రసాద్) అందించిన విశిష్ట సేవలకు, నూతనంగా శ్రీకాకుళం హర్షవల్లి లయన్స్ క్లబ్‌ను స్థాపించినందుకు అవుట్ స్టాండింగ్ పెర్ఫార్మన్స్ అవార్డు లభించింది. విశాఖపట్నంలోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో ఆదిఆరం అంగరంగ వైభవంగా వార్షిక బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. లయన్స్ ఇంటర్నేషనల్ 316-ఎ ద్వారా గవర్నర్ ఉషారాజు జోనల్ చైర్మన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్‌లు ఈ అవార్డులు అందుకున్నారు. అవార్డుల ప్రదానోత్సవంలో లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షులు వావిలపల్లి జగన్నాథనాయుడు, తర్లాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న హారికాప్రసాద్


కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

మూర్తికి ఘన నివాళి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో పిఆర్‌ఒగా పనిచేస్తూ శనివారం గుండెపోటుతో మృతి చెందిన ఆర్.మూర్తి మృతదేహానికి పలువురు ఘనంగా నివాళ్లర్పించారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మూర్తి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళ్లర్పించి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా, ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం వద్ద ఉంచి నివాళ్లర్పించారు. అలాగే నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పార్వతీపురం మన్యం జిల్లా పౌర సంబంధాలశాఖ ఎడి లోచర్ల రమేష్, డిపిఆర్ఒ సింగ్ పాల్గొని నివాళ్లర్పించారు.

పశువుల తరలింపు అడ్డగింత

పలాస : అక్రమంగా తరలిస్తున్న పశువులను లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద యువకుల సహకారంతో పోలీసులు ఆదివారం అతికష్టం మీద పట్టుకున్నారు. ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం వైపు కంటైనర్ ద్వారా ఆవులను తరలిస్తుండగా, స్థానికులు గుర్తించి వాటిని ఆపడానికి ప్రయత్నించారు. వారు వాహనాలను ఆపకపోవడంతో చివరకు టోల్‌గేట్ సిబ్బందికి సమాచారం అందించారు. టోల్‌గేటు మూయించి వాటిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

ఆత్మగౌరవ పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న మధు

పొందూరు: ఉపాధ్యాయ, ఉద్యోగులు ఆత్మగౌరవ పోరాటాలకు సిద్ధం కావాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.మధు పిలుపునిచ్చారు. స్థానిక సిస్టమ్ కళాశాలలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘాల హక్కులను, భావ ప్రకటనా స్వేచ్ఛను హరించే విధంగా విద్యాశాఖ, ప్రభుత్వ ఉన్నతాధికారులు వ్యవహరించడం తగదన్నారు. ఉపాధ్యాయులపై నిర్మాణాత్మకంగా వ్యవహరించి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కొమ్ము అప్పలరాజు, గౌరవ అధ్యక్షులు కోత ధర్మారావు మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో తీవ్ర ఒత్తిడిలకు గురి అవుతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. అనంతరం డిటిఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పూజారి హరిప్రసన్న, ఉపాధ్యక్షులుగా డి.కళావతి, గురుగుబెల్లి రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పేడాడ కృష్ణారావు, కార్యదర్శులుగా సోములయ్య, వై.వి.ప్రసాద్, గండెం రామారావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా వై.తులసీదాస్, గురుగుబెల్లి గోపాలరావు, ఎం.గణేష్, కోటిపాత్రుని కొండయ్య, జి.రాజారావులను ఎన్నుకున్నారు.



లావేరు : పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు



రణస్థలం : పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

లావేరు: లావేరు శాఖాగ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన, చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతినెలా మొదటి ఆదివారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ప్రతి ఆదివారమూ చదవడం మాకిష్టం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రతి విద్యార్థీ గ్రంథాలయానికి వచ్చి ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులకు బహుమతులను గ్రంథాలయం తరుపున ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

రణస్థలం : స్థానిక శాఖగ్రంథాలయంలో నవలలు, కథలు, దేశ నాయకుల జీవిత చరిత్రలు, ఆధ్యాత్మిక గ్రంథాలు, ఆయుర్వే, సైకాలజీ, రిఫరెన్స్, కాంపిటేటివ్, వార, పక్ష, మాస పత్రికలను ప్రదర్శించారు. వీటిని విద్యార్థులు, గృహిణులు, విశ్రాంత ఉద్యోగులు వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి తెలిపారు. ప్రతి 14 రోజులకోసారి పుస్తకాలను మార్చుకొని మరోక పుస్తకాన్ని తీసుకువెళ్లాలని అన్నారు.

ట్యూషన్ ఫీజులో 50 శాతం రాయితీ

ఎంఎల్ఆర్ నాయిడు డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బాల భూపాలనాయుడు

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేటలోని ఎంఎల్ఆర్ నాయిడు డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది డిగ్రీ కళాశాలలో చేరిన విద్యార్థులకు ట్యూషన్ ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు కరస్పాండెంట్ డాక్టర్ బాల భూపాలనాయుడు తెలిపారు. కళాశాలలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ముద్దాడ లక్ష్మి రఘుపతి నాయుడు ఎడ్యుకేషనల్ సొసైటీ 2004లో ప్రారంభించామని తెలిపారు. సొసైటీ ఆధ్వర్యాన 2005లో ఎంఎల్ఆర్ నాయుడు డిగ్రీ కళాశాలను ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రారంభించామని అన్నారు. 18 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సహకరించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన ట్యూషన్ ఫీజులో సగం ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. సమావేశంలో అధ్యక్షులు ముద్దాడ లక్ష్మి, ఉపాధ్యక్షులు కింజరాపు సూర్యప్రకాశరావు, సెక్రటరీ జాయింట్ సెక్రటరీ మధుబాబు, ట్రెజరర్ ధర్మాన గిరిజాకుమారి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


బాల భూపాల నాయుడు

క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే బెందాళం అశోక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్


ప్రజాశక్తి- కవిటి

ఓటర్ల సర్వేలో క్లస్టర్, యూనిట్, బూత్‌స్థాయి ఇన్‌ఛార్జీలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సూచించారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ, నాలుగు మండలాల క్లస్టర్, యూనిట్ బూత్‌స్థాయి ఇన్‌ఛార్జీల సమావేశాన్ని స్థానిక కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ వరకు ఓటర్ల సర్వే కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జి వినియోగించుకుని తమ పరిధిలోని ఓటర్ల జాబితాను సరిచూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కుళ్ళిపోయిన వ్యవస్థతో మనం పోరాడుతున్నామని, అందరూ సక్రమంగా ఉంటారని ఊహించుకోవద్దని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని పనిచేయాలని సూచించారు. కష్టపడితే ఫలితం కచ్చితంగా ఉంటుందని, ప్రశాంతమైన ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎప్పటికీ టిడిపి కంచుకోటేనని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. దాన్ని మరింత బలోపేతం చేసేందుకు అందరం కలిసి పనిచేయాలని సూచించారు. సమావేశంలో టిడిపి నాయకులు సదానంద రౌలో, మాదిన రామారావు, దక్కత ఢిల్లేశ్వరరావు, మణిచంద్ర ప్రకాష్, నాలుగు మండలాల ముఖ్య నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జీలు పాల్గొన్నారు.

స్థానికులకే టిక్కెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

వచ్చే ఎన్నికల్లో స్థానికులకు మాత్రమే ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలని నియోజకవర్గ వైసిపి నాయకులు లోతుగడ్డ తులసీవరప్రసాద్ అధిష్టానాన్ని కోరారు. స్థానిక కమలా కళ్యాణ మండపంలో వైసిపి నాయకులతో, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికేతరులకు ఎమ్మెల్యేగా కట్టుపెట్టడంతో నియోజకవర్గం అభివృద్ధి కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అతిపెద్ద గిరిజన మండలమైన మెళియాపుట్టిలో కనీసం డిగ్రీ కళాశాల లేకుండా పోయిందని అన్నారు. గిరిజన గ్రామాల సరైన రహదారి లేకపోవడంతో గర్భిణులు, రోగులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షులు బమ్మిడి జగన్నాథం రట్టిని, మర్రిపాడు-కె సర్పంచ్‌లు శ్యామలబాబు, హరి, కరజాడ ఎంపిటిసి రవికుమార్, గండేటి చిన్న, శ్రీకరుణ, శ్రీను పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

నేటి నుంచి విఆర్‌ఎల దీక్ష

పొందూరు: కలెక్టరేట్ వద్ద ఈ నెల 7,8న తమ సమస్యల పరిష్కారం కోరుతూ విఆర్‌ఎలు దీక్ష చేపడుతున్నామని, విఆర్‌ఎలు పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తెండేల త్రినాథరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విఆర్‌ఎలకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్‌ఎలుగా గుర్తించాలన్నారు. అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. రికవరీ చేసిన డిఎలను తిరిగి చెల్లించాలన్నారు.

కృష్ణారావుకు అభినందనలు

నందిగాం : మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావును విశాఖపట్నం డిఇఒ ఎల్.చంద్రకళ అభినందించారు. ఉత్తరాంధ్రాలోని ఆరు జిల్లాల పరిధిలో పలు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆరో రోజుల పాటు విశాఖ జిల్లా భీమునిపట్నం సిడార్ స్కూల్‌లో నాయకత్వ లక్షణాలు అనే అంశంపై ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పలు అంశాలపైన, వివిధ రంగాలపైన అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు కృష్ణారావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న కృష్ణారావు



పలాస: 108 సిబ్బందిని సన్మానిస్తున్న వనతి

మధురమైనది స్నేహం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్నేహంలో నిస్వార్థత, ప్రేమ, అభిమానం, ఆప్యాయత, అనురాగం ఉంటాయని, కులమత బేధం ఉండదని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, పి.జి.గుప్తా, కూన వెంకటరమణ మూర్తిలు అన్నారు. అన్ని స్నేహాల కంటే బాల్యస్నేహం ఎంతో మధురానుభూతిని పంచుతుందని అన్నారు. జీవిత కాలం జ్ఞాపకమంగా ఉండేది బాల్య స్నేహం మాత్రమేనని వారు అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు ఎస్.సంజీవరావు, గొర్లె వాసుదేవరావు, ఎం.మల్లిబాబు, డాక్టర్ జి.ఎన్.రావు, పి.సి.పట్నాయక్, గుడ్ల సత్యనారాయణ, నాగేశ్వర, ఈశ్వరరావు, నళిని సుధాకర్, జి.లక్ష్మి, పి.సూర్యారావు పాల్గొన్నారు.

జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ సీనియర్ మెంబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద 108 ఉద్యోగులకు అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు దుస్తులను అందజేశారు. జెసిఐ ఎస్ఎస్ఎ సెనేటర్ నటుకుల మోహన్ 30 మంది సిబ్బంది దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బాడాన దేవభూషణ్, ఫిజియోథెరపిస్టు డాక్టర్ బి.శ్రీనివాస్ పట్నాయక్, మాధవి, జిఎన్ జ్యూయలరీ అధినేత శ్యామ్, పోలిశెట్టి మధు పాల్గొన్నారు.

'108' సిబ్బందికి సన్మానం

పలాస: రోగులు, ప్రమాద సమయంలో తీవ్ర బాధతో ఉన్న క్షతగాత్రులకు తక్షణ వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన 108 సేవలు అమోహమని, అందులో పనిచేస్తున్న 108 సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని లయన్స్ క్లబ్ క్యాజు ల్యాండ్ వనిత అధ్యక్షులు మల్లా జయశ్రీ అన్నారు. కాశీబుగ్గలో ఆదివారం స్నేహితుల దినోత్సవ సందర్భంగా 108 సిబ్బందికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 108 సిబ్బంది అందించిన సేవల ద్వారా ఎన్నో ప్రాణాలు కాపాడడం జరిగిందన్నారు. ఏ సమయంలో ఫోన్ వచ్చిన విసుగు చెందకుండా రోగులు, క్షతగాత్రులకు సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ క్యాజు లాండ్ వనిత కార్యదర్శి తర్లానా శ్వేత కుమారి, కోశాధికారి మల్లా సంతోషి, 108 జిల్లా మేనేజర్ డి.హరిప్రసాద్, పి.గోపి, ఎన్.వెంకటరావు, ఎన్.ఆనందరావు, బి.శ్రీనివాసరావు, ఎస్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అ'పూర్వ' స్నేహితులు

కవిటి: 1984-90 మధ్య ఆర్.బెలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న వారంతా స్నేహితుల దినోత్సవాన్ని చిరస్థాయిగా నిలిచిపోయేలా జరుపుకోవాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా తాము చదువుకున్న పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. ఆడారు.. పాడారు. ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పించి తమ భవిష్యత్‌కు దిశానిర్దేశం చేసిన గురువులను సన్మానించుకున్నారు. 33 ఏళ్ల తరువాత కలుసుకున్న సందర్భంగా ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసున్నారు. అలనాటి తమ చిలిపి చేష్టలు, మధుర జ్ఞాపకాలను తలచుకుని ఆనంద సాగరంలో తేలియాడారు. అనంతరం తమతో చదువుకున్న జీరు జయరాం అనారోగ్యానికి గురయ్యాడని తెలుసుకుని స్నేహితులందరూ కలిసి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. దీంతో తమ అ'పూర్వ'కలయికను పరిపూర్ణం చేసుకున్నారు.

బూర్జ : మండలంలోని ఫ్రెండ్షిప్ డేను విద్యార్థులు ఉత్సాహంగా జరుపున్నారు. తమ చిన్ననాటి స్నేహితులను గుర్తు చేసుకుని వాట్సాప్ లో శుభాకాంక్షలు తెలిపారు.


కవిటి : ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

ఆర్‌టిసి ఇయు రాష్ట్ర అధ్యక్షులు పి.దామోదరరావు


మాట్లాడుతున్న దామోదరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసి ఉద్యోగులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎంప్లాయీస్ యూనియన్ కృషి చేస్తోందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు అన్నారు. నగరంలోని రెవెన్యూ అతిథిగృహంలో యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసిలో ఉద్యోగులకు 11వ పిఆర్‌సి తర్వాత కేడర్ స్ట్రెంత్ సమస్య ఉత్పన్నమైందని, దీనివల్ల ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు ఈనెల 24న ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు అంగీకరించారని తెలిపారు. ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనమైన తర్వాత గతంలో జీతం ఆధారంగా చెల్లించే ఓవర్ టైమ్ డ్యూటీ, నైట్ హాల్టు అలవెన్సులు, మహిళలకు ప్రతినెలా చెల్లించే హెల్త్ అలవెన్సు, మెంటినెన్స్ సిబ్బందికి ఇచ్చే టెక్నికల్ అలవెన్సులు, క్లరికల్ సిబ్బంది నుంచి ఆఫీసర్ల వరకు చెల్లించే గ్రేడ్ పే అలవెన్సులు సకాలంలో అందడం లేదన్నారు.

వీటిని ప్రతి నెలా జీతంతో పాటే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇన్సెంటివ్ స్కీమ్‌లను పాత పద్ధతిలోనే కండక్టర్లు, డ్రైవర్లు, మెంటినెన్స్ సిబ్బందికి ప్రతినెలా చెల్లించాలన్నారు. వైద్య సౌకర్యాలు గతంలో మాదిరిగానే ఇహెచ్ఎస్ నుంచి ఆర్‌టిసి ఉద్యోగులకు మినహాయింపునిచ్చి, మెరుగైన వైద్యం కోసం రిఫరల్ హాస్పిటళ్ల ద్వారా కార్పొరేట్ వైద్యం అందించాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఆర్‌టిసి ఉద్యోగి, భార్యకూ గతంలో ఉన్న రిటైర్డు ఎంప్లాయిస్ మెడికల్ స్కీమ్ ద్వారా వైద్య సౌకర్యాలు అందించేవారని, అదే తరహాలో ప్రస్తుత రిటైర్డు ఉద్యోగులకు హెల్త్ స్కీమ్‌ను వర్తింజేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి నరసయ్య మాట్లాడుతూ విలీనానికి ముందున్న ఆర్‌టిసి రిక్రూట్‌మెంట్, రెగ్యులేషన్స్ ప్రకారమే పిటిడి ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.వెంకటరావు, పి.నానాజీ, ఎపి జెఎసి జిల్లా ఛైర్మన్ కంచరాన శ్రీరాములు, ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కె.జె శుభాకర్, బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


సందడి చేస్తున్న శంకర్ టీమ్ సభ్యులు

అల్లివలసలో షకలక శంకర్ సందడి

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని అల్లివలసలో సినీ నటుడు షకలక శంకర్ బృందం ఆదివారం సందడి చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తూర్పు జిల్లాల్లో చాలామంది కళాకారులు, గాయకులు, నృత్య కళాకారులు ఉన్నారని, వారిని ప్రోత్సహించాలని ఉద్దేశంతోనే అల్లివలసలో యూ ట్యూబ్ పాట కోసం షూటింగ్ చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్నో యూ ట్యూబ్ పాటలు షూటింగ్ తీస్తామని అన్నారు. కార్యక్రమంలో నిర్మాత బవిరి ప్రదీప్, సహాయ నిర్మాత వుద్యాల అంజిబాబు, కొరియోగ్రాఫర్ ఎం.జె.సంజయ్ (ఢీ షో), కెమెరామేన్ స్వామి, అల్లివలస సర్పంచ్ చీకటి ఎర్రయ్య, పండోడు, పొట్టివాడు పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

చంద్రబాబును అరెస్టు చేయాలి

టెక్కలి రూరల్ : మాజీ సిఎం చంద్రబాబు నాయుడుపై ఎ-1 ముద్దాయిగా కేసుమ నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి డిమాండ్ చేశారు. తన స్వగృహం నుంచి స్థానిక పోలీస్ స్టేషన్ వరకు ఆదివారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుంగనూరు వైసిపి కార్యకర్తలపై, పోలీసులపై టిడిపి నాయకులు ముందస్తు పథకం ప్రకారమే చేసి దాడి చేశారని ఆరోపించారు. ఇలాంటి దాడులకు భయపడేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు, మండల పార్టీ అధ్యక్షులు బగాది హరి, కోత సతీష్, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, ఉపసర్పంచ్ ప్రతినిధి గండి అప్పలరెడ్డి పాల్గొన్నారు.

'మహాశక్తి'తో మహిళల అభివృద్ధి


ఇచ్ఛాపురం : పోస్టర్లను పంపిణీ చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి- పలాస

మహిళలు అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాలని టిడిపి మహిళా నాయకులు దట్టి అరుణ అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలోని తాళభద్రలో ఆదివారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్రజల కష్టాలు అన్నీఇన్నీ కావని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్‌టిసి బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో తిరునగర గౌరీ, బద్రి యశోదమ, పొన్నాన లక్ష్మి, దాసరి రాజాలక్ష్మి, హేమావతి, బద్రి అరుణ, అపర్ణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : టిడిపితోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధ్యమని పట్టణ టిడిపి అధ్యక్షులు కాళ్ల ధర్మారావు, టిడిపి జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి ఆశి లీలారాణి అన్నారు. 17 వార్డులో మహాశక్తి కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో కళ్ల జయదేవ్, సంతోష్, పైల నారాయణ, సిద్ధార్థ్ కృష్ణ, అన్నపూర్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న బేపల సతీష్‌కుమార్ 'సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ' పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ పివిజిడి ప్రసాదరెడ్డి ఆదివారం ఆవిష్కరించారని రచయిత తెలిపారు. బిఎస్‌సి తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 5వ సెమిస్టర్‌కు సంబంధించి రచించారని అన్నారు. నూతన విద్యా విధానానికి అనుగుణంగా విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే రీతిలో రచించామని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, అధ్యాపకులు, సిబ్బంది సతీష్‌ని అభినందించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రసాద్‌రెడ్డి


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ఆటో యూనియన్ అధ్యక్షులుగా ఎర్రయ్యరెడ్డి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం భగవతి స్వేచ్ఛావతి ఆటో ఓనర్ డ్రైవర్స్ సంఘం నూతన కార్యవర్గాన్ని సంతపేట వద్ద ఉన్న కమ్యూనిటీ భవనంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా ఉలాసి ఎర్రయ్యరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పైల కేశవరావు, ఉపాధ్యక్షులు డబ్బురి ముకుందరావు, జాయింట్ సెక్రటరీగా కుమార్, కోశాధికారి మురళీ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కొండ శంకరరెడ్డి, అణపాన భైరాగిరెడ్డి, బత్తుల గోపి, ఆర్.జాని పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పూండి గోవిందపురంలో నాయీబ్రాహ్మణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాల్లపేట కృష్ణారావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీష మృతుడి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ అఖిల్, విరల్, మహిళా అధ్యక్షులు పుచ్చ శోభారాణి, మండల మాజీ విప్ కె.ఢిల్లేశ్వరి, క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, మదనాల జోగారావు, బాలాజీ, ఎస్.జె.పురం, గణేష్, చంద్రయ్య పాల్గొన్నారు.

జనసేన...

కవిటి: మండలంలోని కపాసుకుద్ది, సోంపేట మండలం ఇసకలపాలెం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన డిల్లేష్, గంట జనార్ధన్, కోనేరు లోకేష్ కుటుంబ సభ్యులను జనసేన నాయకులు పరామర్శించారు. జనసేన మత్స్యకారుల వికాస విభాగ రాష్ట్ర ఛైర్మన్ బొమ్మిడి నాయకర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, జాయింట్ రాష్ట్ర సెక్రటరీ బైపల్లి ఈశ్వరరావు, మత్స్యకార వికాస విభాగ రాష్ట్ర కార్యదర్శి నాగుల హరి బెహరా, దుర్గాశి నీలవేణి రెడ్డి, దుగాన దివాకర్ ఉన్నారు.


పలాస : పరామర్శిస్తున్న గౌతు శిరీష


పతకాన్ని స్వీకరిస్తున్న రోటరీ సభ్యులు

రోటరీ క్లబ్‌కు బంగారు పతకం

శ్రీకాకుళం అర్బన్ : రోటరీ జిల్లా 3020 ఆధ్వర్యాన నిర్వహించిన 'సమ్మోహనం' డిస్ట్రిక్ట్ మెంబర్‌షిప్ సెమినార్ ఆదివారం విజయనగరంలో సుజాత కన్వెన్షన్‌లో నిర్వహించారు. అత్యధిక సభ్యత్వ నమోదు చేసిన శ్రీకాకుళం రోటరీ క్లబ్‌కు బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అంతర్జాతీయ డైరెక్టర్ టి.ఎన్.సుబ్రహ్మణ్యన్ అందజేశారు. రోటరీ జిల్లా 3020 గవర్నర్ సుబ్బారావు రావూరి (దత్తా) చేతుల మీదుగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గీతాశ్రీకాంత్, అన్నెపు అనంతరావులు స్వీకరించారు.

కషాయాలతో పంట దిగుబడి

రణస్థలం రూరల్: కషాయాలతో పంట దిగుబడితో పాటు లాభాలను చేకూర్చుతాయని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి గంట్యాడ ఏసుబాబు అన్నారు. నవధాన్యాలు సాగు... నెల తల్లికి బాగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావాడ, ఎర్రవరం యామలపేట గ్రామాల్లో ఆదివారం సామూహికంగా కషాయాలు తయారు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, మీనామృతం, ద్రవ జీవామృతం, కషాయాల తయారు చేయిస్తున్నామని తెలిపారు. ఈ కషాయాలు వల్ల పంటకు లాభాలను చేకూర్చుతాయని, పంటపై ఉండే తెగుళ్లను కాండం తొలిచే పురుగులను, చీడపీడ తెగుళ్లను నివారిస్తాయని అన్నారు. ఐసిఆర్‌పిఎస్ రమణమ్మ, సూర్యం, జయలక్ష్మి, జనార్ధన, సుజాత సత్యవతి పాల్గొన్నారు.

గుడ్డ సంచులు ముద్దు

రణస్థలం : ప్లాస్టిక్ కవర్లను నిషేధించి గుడ్డ సంచుల కు ప్రాధాన్యత ఇవ్వాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు అన్నారు. మండలంలోని పైడిభీమవరంలో హరిగ సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థను ఆదివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా పర్యావరణ హితమైన గుడ్డ సంచులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సామాజిక వేత్త, సినీ గేయ రచయిత బనాడ దుర్గాప్రసాద్, టిడిపి నాయకులు విక్రం జగన్నాథం, ఆర్.హరిబాబు, బుడుమూరు యూత్ అసోసియేషన్ ప్రతినిధి కనకరాజు, హరిత సంస్థ సెక్రటరీ పి.తవిటినాయుడు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

సోంపేట : మండలంలోని మామిడిపల్లి పంచాయతీ గణేష్ సెంటర్‌కు చెందిన దున్న తులసమ్మ పాముకాటుకు గురై ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. తులసమ్మ కుమార్తెలకు పూర్వ విద్యార్థులు బాసటగా నిలిచారు. విద్యార్థులు రూ.62,500 విరాళం సేకరించి మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. 1999 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి దున్న మాధవరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.


నగదును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాల అభివృద్ధి పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఎజ్రా

వజ్రపుకొత్తూరు: రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు చొరవతో ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి పనులు చేపడుతున్నామని సర్పంచ్ ముప్పల ఎజ్రా, ఉప సర్పంచ్ ముప్పల దేవా తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో చేపడుతున్న అభివృద్ధి పనులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజుల క్రితం నువ్వులరేవులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి ఇచ్చిన మాటకు కట్టుబడి పాఠశాల అభివృద్ధి పనులకు సహకారం అందించారని తెలిపారు. పాఠశాల ఉప్పుటేరుకు ఆనుకుని ఉండటంతో వర్షాకాలంలో ఆవరణలోకి నీరు ప్రవేశించి విద్యార్థులకు ఇబ్బందికరంగా మారుతుందని అన్నారు. క్రీడా మైదానం కొరత వేధిస్తుందని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని అన్నారు. వీరితో పాటు మత్స్యకార సొసైటీ అధ్యక్షులు బెహరా నీలాంబరి ఎంపిటిసి పి.రామకృష్ణ, శ్యామలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.